ఈనాడు తమిళనాడు

సోమవారం సెప్టెంబరు 30, 2024

కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, గవర్నర్ ఆర్ఎన్ రవి

నలుగురికి చోటు.. ముగ్గురికి ఉద్వాసన

ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్.రాజేంద్రన్, సెంథిల్‌బాలాజీ, కోవి.చెళియన్, నాజర్

- రాష్ట్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ
- కొత్తవారితో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రివర్గాన్ని శనివారం రాత్రి పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధిశాఖ మంత్రి ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా నియమిస్తూ, మంత్రివర్గం నుంచి ముగ్గురిని తొలగిస్తూ, కొత్తగా నలుగురిని నియమిస్తూ, మరో ఆరుగురి శాఖల్లో మార్పులు చేస్తూ ముఖ్యమంత్రి పంపిన ప్రతిపాదనను గవర్నర్ ఆర్.ఎన్.రవి శనివారం ఆమోదించారు. ఈ నేపథ్యంలో మంత్రుల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గిండిలోని రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. సరిగ్గా 3.30 గంటలకు కార్యక్రమం జరిగే చోటుకు విచ్చేసిన గవర్నర్ ఆర్.ఎన్.రవిని ముఖ్యమంత్రి స్టాలిన్ స్వాగతించారు. ఉప ముఖ్యమంత్రి, ప్రమాణస్వీకారం చేయనున్న మంత్రులను గవర్నర్‌కు పరిచయం చేశారు. వేదికపైకి గవర్నర్, ముఖ్యమంత్రి చేరుకున్న తర్వాత జాతీయ గీతం, తమిళ తల్లి ప్రార్థనా గీతాన్ని వినిపించారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఆర్.రాజేంద్రన్, తర్వాత వి.సెంథిల్ బాలాజీ, కోవి.చెళియన్, ఎస్.ఎం.నాజర్‌లతో గవర్నర్ పదవీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గం గవర్నర్‌తో గ్రూపు ఫొటో తీయించుకుంది. కార్యక్రమంలో సభాపతి అప్పావు, జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తదితర మంత్రులు, చెన్నై మహానగర మేయర్ ప్రియ, ఎండీఎంకే ప్రధానకార్యదర్శి వైగో, మనిదనేయ మక్కళ్ కట్చి అధ్యక్షుడు, ఎమ్మెల్యేయైన జవాహిరుల్లా తదితర కూటమి పార్టీల నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, ప్రభుత్వ ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఉదయనిధి, వి.సెంథిల్ బాలాజీ, కోవి.చెళియన్, తంగం తెన్నరసు, మదివేందన్, రాజకన్నప్పన్ తదితరులూ కలిశారు. వారికి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ అనంతరం నూతన మంత్రులు మెరినా తీరంలోని కరుణానిధి, అన్నాదురై సమాధులకు నివాళులర్పించారు.

కొత్త మంత్రులు	శాఖలు
ఆర్.రాజేంద్రన్	పర్యాటకశాఖ
వి.సెంథిల్ బాలాజీ	విద్యుత్తు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్
కోవి.చెళియన్	ఉన్నత విద్య
నాజర్	మైనారిటీలు, ప్రవాస తమిళుల సంక్షేమం

పాతవారికి కొత్తగా దక్కినవి..

పొన్ముడి – అటవీశాఖ, తంగం తెన్నరసు – ఆర్థిక, పర్యాటక, వాతావరణ మార్పులు, రాజకన్నప్పన్ – పాడిపరిశ్రమ, మెయ్యనాథన్ – టీసీ సంక్షేమం, మదివేందన్ – ఆదిద్రావిడ సంక్షేమం, కయల్‌విళి సెల్వరాజ్ – మానవవనరుల శాఖ

ఛాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన సెంథిల్ బాలాజీ, ఉదయనిధి

ప్రజల నమ్మకాన్ని కాపాడేలా వ్యవహరించాలి

- మంత్రులకు సీఎం హితవు

చెన్నై, న్యూస్‌టుడే: ఓటు వేసిన ప్రజల నమ్మకాన్ని కాపాడేలా అందరూ వ్యవహరించాలంటూ మంత్రులకు ముఖ్యమంత్రి స్టాలిన్ హితవు పలికారు. ఉప ముఖ్యమంత్రి, కొత్త మంత్రులకు శుభాకాంక్షలు చెబుతూ ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వజ్రోత్సవాలు నిర్వహిస్తున్న డీఎంకే ఆరోసారి అధికార పీఠంపై కూర్చుని పలు దార్శనిక పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు. నేడు దేశంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తమిళనాడు ఉందని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించడానికి పలు పథకాలను తీర్చిదిద్దుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన ఉదయనిధి రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటారన్నారు. క్రీడాశాఖ ద్వారా ప్రపంచ దృష్టిని ఉదయనిధి ఆకట్టుకున్నారని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ పరిపాలన దక్షత ద్వారా రాష్ట్ర అభివృద్ధికి మరింత శ్రమించాలనే ఉద్దేశంతో ఆయనకు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సెంథిల్‌బాలాజీ, నాజర్, కోవి.చెళియన్ తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో నమ్మకంగా ఓటు వేసి డీఎంకే కూటమిని గెలిపించిన ప్రజల నమ్మకాన్ని కాపాడేలా వ్యవహరించాలంటూ హితవు పలికారు.

మహానాడుకు జిల్లాల వారీగా కార్యకర్తలకు ఆహ్వానం

టీవీకే ప్రధాన కార్యదర్శి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం తొలి రాష్ట్ర మహానాడుకు జిల్లాలవారీగా కార్యకర్తలను ఆహ్వానించనున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్ తెలిపారు. నగరంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు దాము, టి.నగర్ అప్పు సమక్షంలో జరిగిన సమావేశాల్లో బుస్సి ఆనంద్ పాల్గొన్నారు. అక్టోబరు 27న విక్రవాండి జిల్లా వి.సాలైలో జరగనున్న తొలి రాష్ట్ర మహానాడుకు సంబంధించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహానాడుకు పార్టీ కార్యకర్తలను జిల్లాలవారీగా స్వయంగా ఆహ్వానించనున్నట్టు తెలిపారు. వాహనాల్లో అనుమతించిన సంఖ్యలో మాత్రమే కార్యకర్తలు తరలిరావాలని, సుదూర ప్రాంతాలవారు మోటారు బైక్‌లపై రాకూడదని హితవు పలికారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని, మహిళలకు ప్రాధాన్యత, భద్రత కల్పించాలని తెలిపారు. ఏర్పాట్లు చేసేందుకు 25 కమిటీలను నియమించినట్టు పేర్కొన్నారు. మహానాడులో చోటు చేసుకోవాల్సిన విషయాల గురించి అందరూ పార్టీ అధ్యక్షుడికి అభిప్రాయాలు వెల్లడించవచ్చని తెలిపారు.

1న చెన్నై చేరుకోనున్న గుజరాత్ వరద బాధితులు

సైదాపేట, న్యూస్‌టుడే: గుజరాత్ వరదల్లో చిక్కుకున్న తమిళనాడువాసులు అక్టోబర్ 1న చెన్నైకి రానున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర విదేశీ, ప్రవాస తమిళుల సంక్షేమం, పునరావాస శాఖ కమిషనర్ కృష్ణమూర్తి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రానికి చెందిన 26 మంది గుజరాత్ రాష్ట్రంలోని బాల్‌గనర్‌కు తీర్థయాత్రకు వెళ్లి తిరిగొస్తుండగా 26వ తేదీ వారు ప్రయాణిస్తున్న బస్సు మలేశ్రీ నది వరదలో చిక్కుకుందని తెలిపారు. సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ వారిని రక్షించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ మేరకు వరదలో చిక్కుకున్న 26 మంది తమిళులను గుజరాత్ రాష్ట్ర యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించి పునరావాసం కల్పించారని తెలిపారు. 26 మంది అక్టోబర్ 1న రైలు ద్వారా చెన్నైకి చేరుకోనున్నారని పేర్కొన్నారు. వాహన వసతి ఏర్పాటు చేసి వారిని సొంతూర్లకు పంపనున్నట్లు వెల్లడించారు.

చర్యలతో విమర్శలకు సమాధానమిస్తా: ఉదయనిధి

చెన్నై, న్యూస్‌టుడే: తన చర్యల ద్వారా విమర్శలకు తగిన సమాధానమిస్తానని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గంలో శనివారం రాత్రి మార్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ మంత్రి ఉదయనిధి ఆదివారం ఉదయం మెరినా తీరంలోని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై, దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక ప్రదేశాలను సందర్శించారు. వారి సమాధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి అనేది పదవి కాదని, అదో బాధ్యతన్నారు. అతిపెద్ద బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా తనను నియమించినప్పుడూ విమర్శించారని, ఉప ముఖ్యమంత్రిగా నియమించినప్పుడూ విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. శుభాకాంక్షలను స్వీకరించినట్టే విమర్శలనూ స్వీకరిస్తున్నానని తెలిపారు. తన చర్యల ద్వారా విమర్శలకు తగిన సమాధానమిస్తానని పేర్కొన్నారు. వేప్పేరిలోని పెరియార్ గ్రౌండ్‌లో ఉన్న తండ్రై పెరియార్ స్మారక ప్రదేశాన్ని సందర్శించి అక్కడి పెరియార్ సమాధికి పుష్పాంజలి ఘటించారు. వెంట మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేశ్, పెరియకరుప్పన్, ఎంపీలు, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు. ఉదయనిధి తన 'ఎక్స్' పేజీలో... తండ్రై పెరియార్, అన్నాదురై, కరుణానిధి రూపొందించిన మార్గంలో, ముఖ్యమంత్రి మార్గదర్శకంలో తోటి మంత్రులతో కలిసి పనిచేస్తానని తెలిపారు.

అన్నాదురై సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉదయనిధి

ప్రముఖుల శుభాకాంక్షలు

చెన్నై: ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన ఉదయనిధికి ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు కవితా ధారతో శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఈ ఉన్నతి పుట్టుకతో వచ్చిందనడంలో కొంత వాస్తవం, శ్రమతో వచ్చిందనడంలో పూర్తి వాస్తవం. ప్రతీ కదలిక అభివృద్ధి వైపు నడిపించేదేనని ప్రజలను గ్రహించేలా చేయడమే మీ భవిష్యత్తు' అని తెలిపారు. తన పాటను పాడిన ఓ కళాకారుడు ఉప ముఖ్యమంత్రి అయ్యారని భావించి గర్విస్తున్నానన్నారు. సినీరంగ ప్రముఖులు పలువురు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. నటులు రజనీకాంత్, శివకార్తికేయన్, శింబు, దర్శకుడు మారి సెల్వరాజ్ తదితరులు ఆయన ఉన్నతి, కృషిని కొనియాడారు.

తర్వాత ఏం చేయాలో బాగా తెలుసు: కనిమొళి

చెన్నై: ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన ఉదయనిధి స్టాలిన్‌కు తర్వాత ఏం చేయాలనే విషయం బాగా తెలుసని ఆయన మేనత్త, డీఎంకే ఉప ప్రధానకార్యదర్శి, ఎంపియైన కనిమొళి తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా నియమితులైన సందర్భంగా సీఐటీ కాలనీలోని కనిమొళి నివాసానికి ఉదయనిధి ఆదివారం వెళ్లి అక్కడ ఉన్న కరుణానిధి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయనకు కనిమొళి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత నగరంలో విలేకర్లతో కనిమొళి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి బాగా ఆలోచించే ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించారన్నారు. అందువల్ల దీని గురించి ఎవరూ హితోపదేశాలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

బహుళ అంతస్తుల భవనాల భద్రతా చట్టం నిబంధనలు విడుదల

సైదాపేట, న్యూస్‌టుడే: బహుళ అంతస్తుల భవనాల్లో నివాసం ఉంటున్నవారి భద్రతా చట్ట నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. చెన్నైలో అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్నవారు, వాటి యజమానులకు భద్రతా చట్ట నిబంధనలు రూపొందించి తమిళనాడు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ మేరకు అపార్ట్‌మెంట్ల యజమానులు లేదా భవన నిర్మాణ సంస్థలు భవనానికి సంబంధించిన అన్ని వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించాలి. నిర్మాణం పూర్తయి ప్రారంభించిన నిర్దిష్ట నెలల్లో సొసైటీ లేదా సంఘం ఒకటి ఏర్పాటు చేసి దాన్ని రిజిస్టరు చేయించాలి. సంఘానికి సంబంధించిన నిబంధనలు రూపొందించాలి. ఒక సంఘంలో కనీసం నలుగురు యజమానులుండాలి. నమోదు చేసుకున్న సంఘాలు ఒక్కొక్కటి నిర్వాహణ కమిటీని నియమించాలి. ఈ కమిటీ సంఘ ఆస్తుల నిర్వహణ, కామన్ ప్రాంతాలు, సౌకర్యాల నిర్వహణకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకే ఆస్తిలో అనేక నివాసాలు ఉంటే సంబంధిత సంఘాలు ఒక సామాఖ్యను ఏర్పాటు చేయొచ్చు. అక్కడ ఒక్కో సంఘ అధ్యక్షుడు, కోశాధికారి సభ్యులుగా ఉండాలి. అధ్యక్షుడు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా వ్యవహరిస్తారు. పాత భవనాలు పునరుద్ధరించాలంటే నిర్వహణ కమిటీ సొంతంగా గాని, అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వారిలో నాలుగోవంతు వారి అభ్యర్థనపై సమావేశం ఏర్పాటు చేయాలి. సమావేశంలో ఆమోదించే తీర్మానాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఈ నిబంధనల కింద వినతులు సమర్పించేందుకు వెబ్‌సైట్‌ను సంబంధిత శాఖ రూపొందించాలి. నిబంధనలు అమలు చేసే అధికారులుగా ఆయా జిల్లాల రిజిస్ట్రార్లు వ్యవహరిస్తారు.

ఆస్తిపన్ను పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను డీఎంకే ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం మండిపడ్డారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... స్థానిక సంస్థలు 6 శాతం ఆస్తిపన్ను పెంచుకోవచ్చని చెన్నై కార్పొరేషన్ సమావేశంలో తీర్మానం ఆమోదించడం సరికాదన్నారు. అలాగే ఇతర కార్పొరేషన్లు కూడా తీర్మానం ఆమోదించే అవకాశం ఉందని చెప్పారు. దీంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటాని పేర్కొన్నారు. తద్వారా ఇళ్ల అద్దెలు పెరుగుతాయన్నారు. తాగునీరు తదితర ఇతర ఛార్జీలు కూడా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. సామాన్య ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఆస్తిపన్ను పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

'నిర్మలా సీతారామన్‌ని సరిగా విచారించాలి'

ఆర్కేనగర్: ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వద్ద సరిగా దర్యాప్తు చేయాలని ఎంపీ కార్తి చిదంబరం తెలిపారు. ఆయన ఆదివారం పుదుకోట్టైలో విలేకరులతో మాట్లాడుతూ.., ఉదయనిధిని ఉపముఖ్యమంత్రిగా ప్రకటించడం పాలనాపరమైన నిర్ణయమని, దీనిని విమర్శించడం సరికాదన్నారు. సెంథిల్‌బాలాజీని 470 రోజులు జైల్లో ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు. ఈడీ వద్ద ఆధారాలు ఉంటే వెంటనే కోర్టులో సమర్పించి తుది తీర్పు వచ్చేలా చేసి ఉండాలన్నారు.

మదురై ఉపాధ్యాయినికి ప్రధాని ప్రశంసలు

ప్యారిస్: ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మూలికల తోటను పెంచుతున్న మదురై ఉపాధ్యాయినిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ... ఎలాంటి బాధ కలిగినా సహనం కోల్పోకుండా, వాటి నుంచి పాఠం నేర్చుకునే వారు మన చుట్టూ కొందరు ఉంటారని, అలాంటి మహిళల్లో ఒకరు మదురైకి చెందిన ఉపాధ్యాయిని శుభశ్రీగా పేర్కొన్నారు. ఆమె అరుదైన, అత్యంత ఉపయోగకరమైన ఔషధ మొక్కలతో అద్భుతమైన తోటను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆమె తండ్రి పాముకాటుకి గురైనప్పుడు కాపడడానికి సాంప్రదాయ మూలికలు సాయపడ్డాయని, ఆ ఘటన తర్వాత ఆమె సాంప్రదాయ మందులు, మూలికలపై పరిశోధనలు ప్రారంభించారన్నారు. ఆమె మదురై వేరిచ్చియార్ గ్రామంలో 500కి పైగా అరుదైన వైద్య గుణాలు ఉన్న ఔషధ మొక్కల తోటను కఠిన శ్రమతో ఏర్పాటు చేశారన్నారు. కరోనా సమయంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఔషధ మొక్కలను ప్రజలకు ఇచ్చారన్నారు. ఆమె తోటను చూసేందుకు ఎంతో దూరం నుంచి ప్రజలు వస్తున్నారని తెలిపారు. వందల సంవత్సరాలుగా మన సంస్కృతిలో భాగంగా ఉన్న మన సాంప్రదాయాన్ని శుభశ్రీ ముందుకు తీసుకెళ్తున్నారని, ఆమె మూలికల తోట మన గతాన్ని భవిష్యత్తుతో కలుపుతోందని, ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాని చెప్పారు.

ముస్లింలను వంచిస్తున్న డీఎంకే: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ముస్లిం ప్రజలను డీఎంకే వంచిస్తోందని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి విమర్శించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వక్ఫ్ బోర్డు సవరణ చట్టం గురించి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ అన్ని రాష్ట్రాలకు వెళ్లి అక్కడి ఇస్లామిక్ సంస్థల అభిప్రాయాలు సేకరిస్తోందన్నారు. ఆ మేరకు తమిళనాడులో సోమవారం అభిప్రాయాలు సేకరించనుందన్నారు. దీనికి సంబంధించిన సమావేశాన్ని డీఎంకే ప్రభుత్వ మైనారిటీల సంక్షేమశాఖ ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టంలోని అనుకూల, ప్రతికూలతలను ముస్లింలే పూర్తిగా అర్థం చేసుకోగలరన్నారు. అయితే డీఎంకే ప్రభుత్వం ఈ సవరణ చట్టానికి మద్దతు తెలుపుతున్న కొన్ని ఇస్లామిక్ సంస్థలను మాత్రమే అభిప్రాయ సేకరణ సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిసిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా ఎస్‌డీపీఐ, ఐక్య ముస్లిం మున్నేట్ర కళగం, జమాత్ ఇస్లామియా ఇండ్, దేశీయ ముస్లిం లీగ్ తదితర ఇస్లామిక్ సంస్థలను ఆహ్వానించలేదన్నారు. డీఎంకే ప్రభుత్వ ఈ చర్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

పలు విదేశీ విధానాలను అవలంబించాలంటున్న అసోచామ్

వివిధ రంగాల సామర్థ్యం పెంపుపై కీలక సూచనలు

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ సంస్కరణలతో సాధ్యమే!

తమిళనాడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్‌కు చేరుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2021లో లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీనికి తగ్గట్లు అడుగులు వేస్తోంది. అయితే కొన్ని సంస్కరణలు తెస్తే ఇంకా బాగుంటుందని 'ది అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) చెబుతోంది. విదేశాల్లో ఆకట్టుకునే సంస్కరణలను సూచించింది. ఇందులోని ముఖ్యాంశాలు 'ఈనాడు' ప్రత్యేకం.

– ఈనాడు-చెన్నై

ఇవి అనుసరించాలి..

- రక్షణ పారిశ్రామిక కారిడార్‌కు అనుబంధంగా రాష్ట్రంలో దేశీయ ప్రైవేటు కంపెనీలతో తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను, స్టార్టప్‌లను తీసుకురావడం ద్వారా రాష్ట్రానికి మేలు జరుగుతుంది.
- ఈవీ కంపెనీలను విస్తృతంగా పెంచుకోవడంతో పాటు రోబోటిక్ రంగంవైపు సామర్థ్యాన్ని పెంచుకోవాలి. సెమీకండక్టర్ల రంగంలో పరిశ్రమలను తీసుకురావాలి.

విద్యా వ్యవస్థలో మేటి.. జర్మనీ

- విద్యావ్యవస్థలో కీలక సంస్కరణలను జర్మనీ తీసుకొచ్చింది. 10ఏళ్ల విద్యార్థి దశ నుంచి ఒకేషనల్‌వైపు, ఉన్నత విద్య వైపు మూడంచెల విద్యా వ్యవస్థను తెచ్చింది. 9, 10 తరగతుల తర్వాత ఒకేషనల్ విద్యలో డిగ్రీని ప్రవేశపెట్టింది. 12, 13 తరగతుల తర్వాత యూనివర్సిటీ విద్యను అనుసంధానించింది.
- విద్యార్థులు ఈ రెండు దారుల్లో ఏది ఎంచుకున్నా.. వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంది.
- తక్కువ నైపుణ్యాలున్నవారు వయసు ఎక్కువ ఉన్నా కూడా విద్యను కొనసాగించే వెసులుబాటును కల్పించింది. వీరందరి విద్యకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది.
- నైపుణ్యాలు పెంచే శిక్షణల విషయంలో కచ్చితత్వం కోసం ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను తీసుకొచ్చింది.

నైపుణ్యాల కల్పవృక్షం.. కెనడా

- విదేశీ సంస్థలు తమ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు, ఇదివరకే ఉన్న సంస్థలను విస్తరించేందుకు ప్రత్యేక విభాగాల్ని ఏర్పాటుచేశారు. ఎఫ్‌డీఐలను ఆకర్షించేందుకు విభిన్న పథకాలను తెచ్చారు.
- స్థానిక ఉత్పత్తులకు ఊతమివ్వడంతో పాటు ఉద్యోగులకు, నైపుణ్య కార్మికులకు మెరుగైన జీతాల్ని ప్రకటించారు. తద్వారా ఉత్పత్తిని పెంచి వీటికి విదేశాల్లో గిరాకీ ఉండేలా పరిస్థితుల్ని కల్పించారు.
- పారిశ్రామిక అవసరాలనుబట్టి నైపుణ్య విద్యా వ్యవస్థలో మార్పులను తీసుకొచ్చారు. ప్రత్యేక పాఠ్యాంశాలతో పాటు ప్రత్యేక ఒకేషనల్ పాఠశాలలు ఏర్పాటుచేశారు.
- దేశంలో అంతర్గతంగా వలసవెళ్లే కార్మికుల కోసం ప్రత్యేక పాలసీని ప్రవేశపెట్టారు. తద్వారా నైపుణ్యాలున్న మానవవనరుల సామర్థ్యం పెరిగింది.

రాయితీలకు రారాజు.. సింగపూర్

- విదేశీ పెట్టుబడిదారులకు ప్రత్యేక రాయితీలను సింగపూర్ ప్రకటించింది. అవకాశాలకు తగ్గట్లు నైపుణ్య మానవ వనరుల్ని అవలీలగా పెంచే అవకాశం వచ్చింది. ఫలితంగా అటు విదేశీ కంపెనీలు, ఇటు స్వదేశీ కంపెనీలు లబ్ధిపొందుతున్నాయి.
- కంపెనీలకు 10ఏళ్ల పాటు పన్నులో రాయితీలు ప్రకటించారు.
- దేశంలో అందరూ చదువుకునేలా ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రత్యేక పాఠశాల నిర్మాణ కార్యక్రమాల్ని తీసుకొచ్చారు. సాంకేతిక విద్య సామర్థ్యాన్ని పాఠశాల దశనుంచే తీసుకొచ్చారు. ఉన్నత పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారు.

కీలకంగా క్లస్టర్లు

పలు కీలక క్లస్టర్లను రాష్ట్రం వృద్ధి చేసుకోవాల్సిన అవసరముంది. తిరుచ్చిలో హెవీ ఇంజినీరింగ్ క్లస్టర్‌ను తేవడంతో పాటు కృష్ణగిరిలో ప్రింటింగ్ క్లస్టర్ల అవసరం కనిపిస్తోందని అసోచామ్ వివరించింది. ఇక్కడొచ్చిన ఫలితాల ఆధారంగా ఇలాంటివి భిన్నమైన క్లస్టర్లను అవసరాల్నిబట్టి రాష్ట్రవ్యాప్తంగా పెంచుకోవాలని పేర్కొంది.

రాష్ట్రంలో వివిధ వసతులు ఇలా..

రోడ్డు మార్గం –	18,111 కి.మీ
రైలు మార్గం –	6,836 కి.మీ
ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలు (ఐసీడీ) –	11
కంటైనర్ సరకు రవాణా స్టేషన్లు –	46
ప్రైవేటు సరకు రవాణా స్టేషన్ –	1
విమాన కార్గో టెర్మినళ్లు –	6
రైల్వే గూడ్స్ షెడ్లు –	116

- గిడ్డంగుల నిల్వ సామర్థ్యం: 14,72,098 మెట్రిక్ టన్నులు
- శీతల గిడ్డంగుల సామర్థ్యం 4,00,210 మెట్రిక్ టన్నులు
- సరకు రవాణా శిక్షణ కేంద్రాలు – 1
- సరకు రవాణాలో శిక్షణ పొందినవారు 2 వేల మంది

ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థను అందుకునేందుకు తమిళనాడు రాష్ట్రం ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, బయోటెక్నాలజీ రంగాలను వేగంగా వృద్ధి చేసుకోవాలని అసోచామ్ నివేదికలో పేర్కొంది. ఇవి వేగంగా లక్ష్యాన్ని చేరుస్తాయని చెప్పింది. ఇందుకోసం మానవ వనరులను వృద్ధి చేసుకోవాల్సిన అవసరముందని ఆ సంస్థ ప్రతినిధులు సూచించారు. దీంతో పాటు పలు దేశాల్లోని మెరుగైన సంస్కరణలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

సరకు రవాణాకు సూచనలు

- వివిధ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు పీపీపీ విధానంలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలి.
- రైల్వే సరకు రవాణా సామర్థ్యాన్ని మరింతగా పెంచాల్సిన అవసరముంది. ఖర్చును తగ్గించేందుకు ఈ మార్గాన్ని ఎక్కువగా వినియోగంలోకి తేవాలి. ఇదే తరహా జలమార్గాలను మరింతగా పెంచుకోవాలి.
- కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కోయంబత్తూరు, తిరుప్పూరు, దిండుక్కల్ క్లస్టర్లను కలుపుతూ రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. మదురై–తూత్తుకుడి రింగురోడ్డు అవసరముంది.
- పారిశ్రామికవాడల్లో రవాణా వాహనాల పార్కింగ్ సామర్థ్యాన్ని పెంచాలి. ప్రతీ 100కి.మీ దూరంలో ఇలాంటి వసతి ఉండాలి.
- చెన్నైతో పాటు కోయంబత్తూరు, మదురై, తత్తుకుడిలో లాజిస్టిక్ పార్కుల అవసరముంది. దేశీయ కార్గోకు ఇక్కడ వసతులు పెంచొచ్చు.
- చెన్నై విమానాశ్రయంలో శీతల గిడ్డంగి అవసరముంది. తూత్తుకుడిలో కార్గో టెర్మినల్ కావాలి.
- ఎగుమతులు, దిగుమతుల సమన్యాల్ని వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఏకగవాక్ష సేవా కేంద్రాల్ని ఏర్పాటు చేయాలి.

(c) eenadu

తవ్వకాల్లో పురాతన బంగారు నాణెం లభ్యం

వెలుగుచూసిన బంగారు నాణెం

ప్యారిస్, న్యూస్‌టుడే: విరుదునగర్ జిల్లా విజయ కారిసల్‌కుళంలో జరుగుతున్న మూడో దశ తవ్వకాల్లో ఇప్పటివరకు మట్టి బొమ్మలు, పగడపు గంటలు మొదలైన 2 వేలకి పైగా వస్తువులను గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బంగారు నాణెం లభ్యమైంది. తవ్వకాల విభాగ డైరెక్టర్ భాస్కర్ పొన్నుసామి మాట్లాడుతూ... పూర్వీకులు వ్యాపారం చేసేవారు అని చెప్పేందుకు పలు ఆధారాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం లభించిన బంగారు నాణెం అలంకార వస్తువుగా ఉపయోగించినట్లు తెలుస్తోందన్నారు.

మినీ బస్సు సేవలు పునర్‌ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో డిసెంబర్ నుంచి మినీ బస్సు సేవలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. 1996 కరుణానిధి పాలనలో మామూలు బస్సులు వెళ్లలేని కుగ్రామాలకు మినీ బస్సుల సేవలు ప్రారంభించారు. తర్వాత 2013 జయలలిత హయాంలో ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. వీటికి ప్రజల నుంచి ఆదరణ లభించింది. తర్వాతి ప్రభుత్వాల్లో ఈ సేవలను క్రమంగా తగ్గించారు. డీఎంకే పాలనలో 90 శాతం సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మినీ బస్సు సేవలను మళ్లీ ప్రవేశపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం సేవలను పునఃప్రారంభించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి వివరణాత్మక ముసాయిదా నివేదికను రూపొందించి విడుదల చేసింది.

డిసెంబర్ నుంచి నడిపేందుకు చర్యలు

రూట్లవారీ విభజన

డిసెంబర్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ సేవలను ప్రారంభించనున్నారు. దీని గురించి రవాణాశాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. ఒక గ్రామంలో కనీసం 100 కుటుంబాలు ఉండి, ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడవని ప్రాంతాలకు ఈ సేవలు కల్పిస్తామన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ల అభిప్రాయాలను కోరుతున్నామని, 70శాతం బస్సు సేవలు లేని ప్రాంతాలకు, 30శాతం బస్సు సౌకర్యం ఉన్న ప్రాంతాలను అనుసంధానించే విధంగా రూట్లను రూపొందిస్తామన్నారు. కొత్త ప్రణాళిక ప్రకారం 25 కి.మీలోపు నడిపేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో 17 కి.మీ దూరం బస్సు సేవలు లేని మార్గంగాను, 8 కి.మీ బస్సు సేవలు ఉండే మార్గం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. జీపీఎస్ పరికరం అమర్చిన మినీబస్సులో 25 సీట్లు ఉంటాయని, త్వరలో దీనిపై మార్గదర్శకాలను విడుదల చేస్తామని వెల్లడించారు.

పరేడ్ తిలకిస్తున్న ఐజీ దత్విందర్ సింగ్ సైనీ

'ఐసీజీ' ఐజీగా దత్విందర్ సింగ్ సైనీ

వడపళని, న్యూస్‌టుడే: కోస్ట్ గార్డ్ రీజియన్ (ఈస్ట్)గా ఇన్‌స్పెక్టర్ జనరల్ దత్విందర్ సింగ్ సైనీ ఆదివారం చెన్నైలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పరేడ్ తిలకించారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న డానీ మైఖేల్ విశాఖపట్నానికి ఏడీజీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. సైనీ 1990 జనవరి 15న ఐసీజీలో విధుల్లో చేరారు. యూఎస్ఏ వర్జీనియాలో 2003లో 'ఏఎంవో' స్పెషలైజేషన్ కోర్సును పూర్తి చేశారు. నావికా విభాగంలో పలు హోదాల్లో పని చేశారు. 2009-10 కాలంలో కోస్ట్ గార్డ్ స్టేషన్ మండపంలో కమాండ్‌గా కూడా సేవలందించారు.

శివరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, అధికారులు

చెన్నై మాజీ మేయర్ శివరాజ్‌కు నివాళి

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మాజీ మేయర్ శివరాజ్ 139వ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నివాళి అర్పించారు. టంకశాలలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న శివరాజ్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు, చెన్నై మహానగర కార్పొరేషన్ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, తమిళాభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, పలువురు ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటించారు.

ఉదయనిధి ఆగమనంతో డీఎంకేకు విజయాలు

ఆర్.ఎస్.భారతి

చెన్నై, న్యూస్‌టుడే: రాజకీయాల్లోకి ఉదయనిధి వచ్చినప్పటి నుంచి డీఎంకే అన్ని ఎన్నికల్లోనూ గెలిచిందని ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.ఎస్.భారతి తెలిపారు. ఉదయనిధి స్టాలిన్‌ను ఉప ముఖ్యమంత్రిగా నియమించిన సందర్భంగా తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో కార్యకర్తలు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆర్.ఎస్.భారతి మాట్లాడుతూ... పార్టీ సీనియర్ నేతల నుంచి చిట్టచివరి కార్యకర్త వరకు ఎంతో కాలంగా ఎదురుచూసిన మార్పు జరిగిందన్నారు. ఉదయనిధి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి అన్ని ఎన్నికల్లోనూ డీఎంకే గెలిచిందని, భవిష్యత్తులోనూ ఈ గెలుపు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

17 మంది జాలర్ల అరెస్టు

ప్యాలిస్, న్యూస్‌టుడే: రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి శనివారం సుమారు మూడువేల మందికి పైగా మత్స్యకారులు సముద్రంపైకి చేపల వేటకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున నెడుందీవి వద్ద చేపలు పడుతున్న జెబస్టీన్, రాజీవ్, వివేక్, ఇన్నాచ్చి, సామువేల్, భాస్కరన్, దుర్రై, అరుళ్ దినకరన్ మొదలైన 17 మందిని సరిహద్దులు దాటివచ్చారని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. వారి రెండు పడవలను స్వాధీనం చేసుకుంది. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 55 పడవలను స్వాధీనం చేసుకున్న శ్రీలంక నావికాదళం 413 మంది జాలర్లను అరెస్టు చేయడం గమనార్హం.

విద్యార్థి జీవితం విలువైనది

విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యాలిస్, న్యూస్‌టుడే: విలువైన విద్యార్థి జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే బంగారు భవిత దక్కుతుందని అజంతా అధినేత డాక్టర్ శంకరరావు హితవుపలికారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ధర్మ సంస్థ నిర్వహణలోని వసతిగృహ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వార్షిక సమ్మేళనం ఎస్‌కేపీ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం జరిగింది. ప్రస్తుత విద్యార్థులకు నూతన వస్త్రాలు, బ్యాగ్, క్రీడా పరికరాలను పూర్వ విద్యార్థుల తరపున శంకరరావు అందజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎస్‌కేపీడీ ధర్మ సంస్థ మాజీ సభ్యులు మన్నారు ఉదయ్‌కుమార్ వసతిగృహ విద్యార్థులకు అధునాతన సాంకేతిక ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్వ విద్యార్థుల తరపున అందజేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఎస్‌కేపీడీ పాలక మండలి సభ్యులు తాతా బద్రీనాథ్ లక్కీ డిప్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా చెన్నై సిస్టర్స్‌గా ప్రసిద్ధిగాంచిన మోనికా, డీపికల భరతనాట్య ప్రదర్శన కనువిందు చేసింది. సంఘ పోషకులు ఎంకే రవీంద్రన్, సీనియర్ సభ్యులు చంద్రయ్య, సంఘ అధ్యక్షుడు జగదీశ్‌బాబు, కార్యదర్శి బాలాజీ, వసతిగృహ మాజీ సూపరింటెండెంట్ ఎంఏ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పెంపు నిర్ణయం సరికాదు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఆస్తిపన్ను పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసహరించుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ మర్చంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ తమిళనాడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విక్రమరాజా విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో గత రెండేళ్లలో ఆస్తిపన్ను చాలాసార్లు పెంచినట్లు గుర్తు చేశారు. వాణిజ్య భవనాలపై అదనపు పన్ను విధించారని, అదే సమయంలో విద్యుత్తు చార్జీలు కూడా పెంచారని వాపోయారు. దీని నుంచి ప్రజలు కోలుకోక ముందే చెన్నై కార్పొరేషన్ ఆస్తులపై 6 శాతం పన్ను విధించడం దారుణమని ఖండించారు. దీనిని ప్రజలు, వ్యాపారులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కావున ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

యూట్యూబ్ ఛానెల్‌పై భాజపా ఫిర్యాదు ఉపసంహరణ

సైదాపేట, న్యూస్‌టుడే: 'పరిదాబంగల్' యూట్యూబ్ ఛానెల్‌పై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోనున్నట్లు తమిళనాడు భాజపా నేత అమర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో యూట్యూబర్‌లు గోపీ, సుధాకర్ కలిసి నిర్వహిస్తున్న 'పరిదాబంగల్' యూట్యూబ్ ఛానెల్‌లో 'లడ్డూ పరిదాబంగల్' పేరుతో ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియో వివాదాస్పదం కావడంతో కొన్ని గంటల్లోనే దానిని తొలగించారు. దీని గురించి ఛానెల్ నిర్వాహకులు వివరణ కూడా ఇచ్చారు. అది కేవలం హాస్యం కోసం రూపొందించామని, ఎవరి మనోభావాలను కించపరిచేందుకు కాదని, ఒకవేళ ఎవరినైనా ఈ వీడియో బాధించి ఉంటే వారికి క్షమాపణ చెబుతున్నట్లు పేర్కొన్నారు. అయితే వీడియో తొలగించినా సామాజిక మాధ్యమాల్లో అనేక మంది షేర్ చేస్తున్నారని, హిందువుల మనోభావాలను కించపరిచిన ఛానెల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీకి తమిళనాడు భాజపా విభాగం తరపున అమరప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తమిళనాడు భాజపా సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్. రాజాను గోపీ, సుధాకర్ క్షమాపణ కోరడంతో ఫిర్యాదును ఉపసంహరించుకునేందుకు నిర్ణయించినట్లు అమర్‌ప్రసాద్‌రెడ్డి తన 'ఎక్స్' పేజీలో తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని: విద్యుత్తుశాఖ చేపడుతున్న అత్యవసర మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుమ్మిడిపూండి సిప్కాట్ 3, జీపీడీ సిప్కాట్ ఏరియా, ఎన్నూరు, జేజే నగర్, అనకాపుత్తూరు, సేలైయూరు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న వానతీ శ్రీనివాసన్

డీఎంకేలో వారసులకే పెద్దపీట: వానతి

కోయంబత్తూర్, న్యూస్‌టుడే: డీఎంకేలో ఎంతోమంది సీనియర్ నాయకులు ఉన్నా వారసులకే ముఖ్య పదవులు కట్టబెడుతున్నారని భాజపా ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ ఆరోపించారు. కోవై నగరంలో ఆదివారం జరిగిన 'వాయిస్ ఆఫ్ ప్రైమ్ మినిస్టర్ మైండ్' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడాన్ని విమర్శించారు. దీంతో ఆ పార్టీలో వారసత్వ రాజకీయాలు కొనసాగుతున్నాయనేది నిరూపితమైందన్నారు. అదేవిధంగా అవినీతి ఆరోపణలతో జైల్లో ఉన్న వ్యక్తికి కూడా మళ్లీ మంత్రి పదవి ఇచ్చారన్నారు. రాష్ట్రంలో సమాజసేవ చేస్తున్నవారిని, ప్రత్యేక ఆవిష్కర్తలను గుర్తించి తాము ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వారితో ప్రధాని సంభాషించడంతో పాటు వారికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెస్తున్నారన్నారు.

ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఎన్.శ్రీకృష్ణ

'ఎస్‌కేపీసీ'లో ఆడిటోరియం ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: శ్రీ కన్యకాపరమేశ్వరి ఆర్ట్స్ సైన్స్ మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో ఆదివారం ఏసీ వసతితో కూడిన ఆడిటోరియం ప్రారంభోత్సవం జరిగింది. బ్రహ్మయ్య అండ్ కంపెనీ సీనియర్ పార్ట్‌నర్, తమిళనాడు, పుదుచ్చేరి తిరుమల తిరుపతి దేవస్థానం స్థానిక సలహా మండలి మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆడిటోరియాన్ని ప్రారంభించారు. ఈక్విటాస్ బ్యాంకు సీఎస్సార్ హెడ్ జాన్ అలెక్స్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.మోహనశ్రీ, డీన్ డాక్టర్ పి.వనిత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నృత్య ప్రదర్శన ఏర్పాటైంది. ఈ నెల 20వ తేదీ కళాశాలలో రాజన్ ఐకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న 74 మందికి ఆదివారం ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

కన్నియాకుమరిలో

పర్యాటకుల సందడి

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాఠశాలలకు త్రైమాసిక సెలవులు కావడంతో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కన్నియాకుమరికి పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున త్రివేణి సంగమం వద్ద సూర్యోదయాన్ని తిలకించి పరవశించారు. అదేవిధంగా తిర్పరప్పు జలపాతం, ఉదయగిరి కోట మొదలైన ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.

సూర్యోదయాన్ని తిలకించేందుకు గుమిగూడిన పర్యాటకులు

పాత బస్సులను పక్కన పడేయాలి

సైదాపేట, న్యూస్‌టుడే: పాత ప్రభుత్వ బస్సులను వినియోగించకూడదని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... వ్యాపార వినియోగానికి 15 ఏళ్లు, వ్యక్తిగత ఉపయోగానికి 20 ఏళ్లకు మించి వాహనాలను వాడకూడదని మోటారు వాహన చట్టంలో నిబంధనలు ఉన్నాయని, ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2023 ఏప్రిల్‌లోనే రాష్ట్రంలోని ప్రభుత్వ రవాణా సంస్థల్లో 1500 బస్సులు, 2500 ఇతర వాహనాలు 15 ఏళ్ల దాటినవిగా ఉన్నాయన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో వాటిని ఒకటిన్నర సంవత్సరం నడిపేందుకుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిందని చెప్పారు. అయితే ప్రస్తుతం ఒకటిన్నర సంవత్సరం దాటిందని, ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన మరో 2247 వాహనాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోందని తెలిపారు. వాటిని తొలగిస్తే పలువురి జీవనోపాధి దెబ్బతింటుందని ప్రభుత్వం కారణం చెప్పడం ఆమోదయోగ్యం కాదన్నారు. దీనివలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే 15 ఏళ్లకు పైగా వినియోగంలో ఉన్న వాహనాలను పక్కన పడేయాలని డిమాండ్ చేశారు.

డీఎంకేకు ప్రధాన పోటీదారు అన్నాడీఎంకేనే

సేలం, న్యూస్‌టుడే: సేలం ఆయోధ్యపట్టిణం పశ్చిమ యూనియన్‌లో అన్నాడీఎంకే కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న మాజీమంత్రి విజయభాస్కర్ మాట్లాడుతూ... ప్రజలు అధికంగా అభిమానించే పార్టీ అన్నాడీఎంకేనని చెప్పారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే, డీఎంకే మధ్యే శాసనసభ ఎన్నికల్లో పోటీ ఉంటుందన్నారు. జయలలిత మరణానంతరం పార్టీ నుంచి తప్పుకున్నవారే ఇప్పుడు దిగజారిపోయారని విమర్శించారు.

ప్రసంగిస్తున్న విజయభాస్కర్

రవాణాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బస్సుపై అనుమతించిన ప్రకటన పోస్టర్లు ఉంటున్నా డ్రైవర్‌కు జరిమానా విధిస్తున్నారని, ఇందుకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రవాణా సంస్థ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి టీవీ పద్మనాభన్ రవాణాశాఖ మంత్రికి లేఖ రాశారు. అందులో.. ప్రభుత్వ రవాణా సంస్థల బస్సులపై అనుమతి ఉన్న ప్రకటన పోస్టర్లు ఉన్నా డ్రైవర్‌కు జరిమానా విధిస్తున్నారని, అలాగే హారన్ మోగించడం నిషేధం లేని ప్రాంతాల్లో హారన్ ఉపయోగించారని చెప్పి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జరిమానా విధిస్తున్నారని తెలిపారు. ఇటీవల తిరుచ్చి జోన్‌లోని నగర బస్సు డ్రైవర్‌కు అకారణంగా రూ.1500 జరిమానా విధించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రవాణాశాఖ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రతాధికారుల తనిఖీ

మంత్రి మా. సుబ్రమణియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రతా విభాగ అధికారులు తనిఖీలు చేస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్ సమీపంలో కౌన్సిల్ ఫర్ లెదర్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా, తమిళనాడు పర్యాటకాభివృద్ధి సంస్థ, సీఏండీఏ తరపున ఆదివారం 'సోల్స్ ఫర్ సోల్స్ మారథాన్-2024' పేరిట మత్తుపదార్థాల రహిత సమాజంపై అవగాహన మారథాన్‌ను నిర్వహించారు. మారథాన్‌ని మా.సుబ్రమణియన్ ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రతాశాఖ అధికారులు 391 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టి నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు. 2023 సెప్టెంబర్ 1 నుంచి 2024 సెప్టెంబర్ 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 3,61,057 గోదాములు, వాహనాలలో తనిఖీలు జరిపారని, పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 19,822 దుకాణాలకు సీల్ వేసినట్లు తెలిపారు.



ఊరేగింపుగా వస్తున్న మహిళలు

భారీగా తగ్గిన చేపల ధరలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పెరటాసి మాసం విష్ణువుకి ప్రీతిపాత్ర మైనం నెల కావడంతో రాష్ట్రంలోని హిందువులు మాంసాహారానికి దూరంగా ఉండి నియమనిష్ఠలతో ఉంటారు. దీంతో మాంసం, చేపల ధరలు ఈ నెలలో తగ్గిపోతాయి. వివాహాలు, ఇతర శుభకార్యాలు ఈ మాసంలో నిర్వహించరు. ఈ నేపథ్యంలో కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం చేపల ధర తగ్గింది. వంజరం, శంకర, షీలా రకం చేపలు, పీతలు, రొయ్యలు అధికంగా తీరానికి చేరుకోవడంతో గిట్టుబాటు ధర లేక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

పుదుచ్చేరి-కొచ్చి విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి నుంచి కేరళ రాష్ట్రం కొచ్చికి విమాన సర్వీసులు నడిపేందుకు పరిశీలిస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ తెలిపారు. పుదుచ్చేరిలోని కేరళ సమాజ్ తరపున కుటుంబ సౌకృత మేళా-2024 ఆదివారం కడలూర్ రోడ్డులోని ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కైలాష్‌నాథన్ మాట్లాడుతూ... తాను కేరళలో జన్మించినా తమిళనాడులోనే విద్య పూర్తి చేశానని చెప్పారు. పుదుచ్చేరి నుంచి పొరుగు రాష్ట్రాలకు విమాన సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. అదే సమయంలో పుదుచ్చేరి నుంచి కేరళకు సేవలందించాలని కొందరు కోరుతున్నారని పేర్కొన్నారు. వారి విజ్ఞప్తి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పలు రైళ్ల రద్దు

వడపళని, న్యూస్‌టుడే: సికింద్రాబాదు డివిజన్‌లోని విజయవాడ - కాజీపేట - బల్లార్షా సెక్షన్లు, వరంగల్ - హసన్‌పర్తి - కాజీపేట ఎఫ్ క్యాబిన్ల మధ్య జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా కొన్ని రైళ్లు రద్దయినట్లు దక్షిణ రైల్వే ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది.. ▶ **16031** డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా అండమాన్ ఎక్స్‌ప్రెస్ 05.15 రైలు 29, అక్టోబరు 2 తేదీలు, **16032** శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా - చెన్నై సెంట్రల్ 22.25 రైలు అక్టోబరు 4, 5 తేదీలు రద్దయ్యాయి. ▶ **03241** ధనపూర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు వయా పెరంబూరు, కాట్పాడి, జోలార్‌పేట్టై అక్టోబరు 4న 15.00కు నడిచే రైలు, **03242** ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనపూర్ వయా జోలార్‌పేట్టై, కాట్పాడి, పెరంబూరు 29, అక్టోబరు 6న 23.50కు బయలుదేరే రైలు, **03245** ధనపూర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు వయా పెరంబూరు, కాట్పాడి అక్టోబరు 2న 15.00 రైలు, **03246** ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనపూర్ వయా జోలార్‌పేట్టై, కాట్పాడి, పెరంబూరు అక్టోబరు 4న 23.25 రైలు, **03247** ధనపూర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు వయా పెరంబూరు, కాట్పాడి, జోలార్‌పేట్టై అక్టోబరు 3న 15.00 రైలు రద్దు చేశారు.

తాత్కాలికంగా అదనపు బోగీలు

▶ **12830** భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ అక్టోబరు 3 నుంచి నవంబరు 14, **12829** చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ అక్టోబరు 4 నుంచి నవంబరు 15 వరకు అదనంగా ఒక జనరల్ రెండో తరగతి బోగీని జత చేస్తున్నారు.

తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయం పెరుంగుడి ప్రాంగణంలో ఆదివారం జరిగిన 14వ స్నాతకోత్సవంలో కులపతియైన గవర్నర్ ఆర్.ఎన్.రవి పాల్గొని విద్యార్థులకు డిగ్రీలు, పతకాలు ప్రదానం చేశారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. - చెన్నై, న్యూస్‌టుడే

నీలగిరిలో భారీవర్షం

స్తంభించిన జనజీవనం

కూలిన వృక్షాన్ని తొగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విల్లివాక్కం: నీలగిరి జిల్లా ఊటీ, కున్నూర్, కొత్తగిరి పరిసర ప్రాంతాలలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గరిష్ఠంగా కోడనాడులో 80 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో జనజీవనం స్తంభించింది. కున్నూర్‌లోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలైన ల్యాంప్‌స్టాక్, డాల్ఫినోస్ వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై భారీవృక్షం కూలింది. దీంతో నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. అగ్నిమాపక సిబ్బంది దానిని తొలగించారు. పందుమై, బ్లాక్‌బ్రిడ్జి ప్రాంతాలలో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం ఉదయం వరకు ఊటీలో 11, నడువట్టంలో 2, కిలన్‌మార్గన్‌లో 11, మసినకుడిలో 16, కుందాలో 12, అవలాంజిలో 20, ఎమరాల్డ్‌లో 13, కెత్తైల్ 16, కిణ్ణక్కొరైలో 12, అప్పర్‌భవానిలో 5, కున్నూర్‌లో 37, బర్లియారులో 5, కొత్తగిరిలో 25, కీణ్‌కోత్తగిరిలో 37, కూడలూర్‌లో 3 మి.మీ వర్షపాతం నమోదైంది.

వరద ప్రమాద హెచ్చరికలు

ప్యారిస్: తేని జిల్లా పెరియకుళం, పరిసర ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో మంజలారు జలాశయానికి నీటిరాక అధికమైంది. 57 అడుగుల సామర్థ్యమున్న జలాశయంలో ప్రస్తుతం 55 అడుగుల నీరు ఉంది. 184 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా ప్రజాపనులశాఖ అధికారులు తీరప్రాంత ప్రజలకు వరద ప్రమాద హెచ్చరికలు జారీచేశారు.

మద్యపాన నిషేధానికి మహాయాగం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: 'మద్యాన్ని నిర్మూలించి ప్రజలను కాపాడుదాం' అనే నినాదంతో పీఎంకే తరపున కుంభకోణం రైల్వేస్టేషన్ సమీపంలో సర్వమంగళ మహాయాగం ఆదివారం నిర్వహించారు. పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ ఆదేశాల మేరకు తంజావూర్ ఉత్తర జిల్లా పీఎంకే తరపున ఈ యాగం జరిగింది. ఇందులో రామదాస్ పెద్ద కుమార్తె కాంతి పరశురామన్, అనేకమంది మహిళలు ఒకేరకమైన చీరలు ధరించి పాల్గొన్నారు. ముందుగా పుణ్యతీర్థం, యాగానికి కావాల్సిన వస్తువులను భీముశేశ్వర్ ఆలయం నుంచి ఊరేగింపుగా యాగం జరిగే కామరాజర్ రోడ్డుకు తీసుకొచ్చారు.

(c) eenadu

'ఫ్రీడం' గ్లిమ్స్ వీడియో విడుదల



చెన్నై, న్యూస్‌టుడే: సత్య శివ దర్శకత్వంలో శశికుమార్, లిజోమోల్ జోస్ జంటగా నటించిన చిత్రం 'ఫ్రీడం'. శశికుమార్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక గ్లిమ్స్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. శ్రీలంక శరణార్థిగా జైలులో ఉన్న ఓ నిరపరాధి అక్కడి నుంచి తప్పించుకునే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. జిబ్రాన్ సంగీతం సమకూర్చారు. చిత్రం విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

వేట్టైయన్‌లో నజీమాగా రోహిణి

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు రజనీకాంత్, దర్శకుడు జ్ఞానవేల్ కాంబినేషన్‌లో రూపొందిన 'వేట్టైయన్' అక్టోబరు 10న విడుదల కానుంది. చిత్రంలోని నటుల పాత్రలను పరిచయం చేస్తూ చిత్రబృందం వీడియోలు విడుదల చేస్తోంది. ఇప్పటికే రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, రిత్తికా సింగ్, దుషారా విజయన్, మంజు వారియర్, రానా, ఫహద్ ఫాజిల్, అభిరామి, కిశోర్ తదితరుల పాత్రలకు సంబంధించిన వీడియోలు విడుదల చేసింది. ఆ కోవలో నటి రోహిణి 'నజిమా' పాత్రలో నటించినట్టు వీడియో ద్వారా చిత్రబృందం వెల్లడించింది.

రోహిణి పాత్రను తెలియజేసే పోస్టరు

మరికొన్ని సినీ విశేషాలు

- శింబు దేవన్ దర్శకత్వంలో యోగిబాబు ప్రధాన పాత్రలో నటించిన 'బోట్' ఈ నెల 2న విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రం అక్టోబరు 1న అమెజాన్ ప్రైమ్ ఓటీటీ ప్లాట్‌ఫాంలో విడుదల కానుంది.
- తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో అట్టకత్తి దినేశ్, హరిశ్ కల్యాణ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'లబ్బర్ పందు' చిత్రాన్ని ప్రశంసిస్తూ భారత్ మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తన 'ఎక్స్' పేజీలో తమిళంలో పోస్టు పెట్టారు. ఇప్పటికే భారత క్రికెటర్ అశ్విన్ కూడా తన 'ఎక్స్' పేజీలో ఈ చిత్రాన్ని అభినందించడం గమనార్హం.

కుడుంబస్తన్ ఫస్ట్‌లుక్ పోస్టరు...

చెన్నై: వర్ధమాన దర్శకుడు రాజేశ్వర్ కాళిదాస్ దర్శకత్వంలో మణికంఠన్ ప్రధానపాత్ర పోషిస్తున్న చిత్రం 'కుటుంబస్తన్'. తెలుగు నటి శాన్వీ మేఘన నాయికగా నటించి ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి ప్రవేశించారు. గురు సోమసుందరం ఓ కీలకపాత్రను పోషించారు. చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టరును నటుడు శింబు విడుదల చేశారు. సినిమాకారన్ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి వైశాక్ సంగీతం సమకూర్చారు. నటుడు మణికంఠన్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం ప్రత్యేక పోస్టరునూ విడుదల చేసింది.

13 ఏళ్లకు కుటుంబం చెంతకు పంజాబ్‌వాసి

కుమారులతో కందర్‌సింగ్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా విజయనారాయణం ప్రాంతం వద్ద సెప్టెంబర్ 17వ తేదీ రోడ్డుపై తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అతని మానసిక స్థితి సరిగాలేదని గుర్తించి నాంగునేరిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో చేర్చారు. అతని గురించి జరిపిన దర్యాప్తులో.. అతను పంజాబ్ రాష్ట్రం పఠాన్‌కోట్ ప్రాంతానికి చెందిన కందర్‌సింగ్ (73) అని, ఇదివరకు సైన్యంలో కెప్టెన్‌గా పనిచేశారని, భార్య మరణించడంతో రెండో పెళ్లి చేసుకున్నారని, కుటుంబ కలహాలతో మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వచ్చేసి దేశవ్యాప్తంగా తిరుగుతున్నట్లు తెలిసింది. దీంతో పంజాబ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. 2011లో పఠాన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో కందర్‌సింగ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. దీంతో వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారి కుమారులైన అనిల్‌సింగ్, సునిల్‌సింగ్‌ని నాంగునేరి వృద్ధాశ్రమానికి పిలిపించి కందర్‌సింగ్‌ని వారికి అప్పగించారు.

టీవీకే జెండావిష్కరణ కార్యక్రమం నిలుపుదల

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు అక్టోబరు 27వ తేదీ విక్రవాండిలో జరుగనుంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఆవిష్కరించి సంక్షేమ సాయం అందజేయనున్నారు. ఆ మేరకు ఈరోడ్ రాజాజిపురంలో కొన్ని రోజుల క్రితం పార్టీ జెండా స్తంభం ఏర్పాటు చేశారు. జెండా ఆవిష్కరించడానికి పార్టీ నేతలు నగరపాలక సంస్థ అనుమతి కోరారు. ఇంకా అనుమతి రాలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం జెండా ఆవిష్కరించి ప్రజలకు సంక్షేమ సాయం అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. సమాచారం మేరకు పోలీసులు శనివారం సాయంత్రం అక్కడకు చేరుకుని అనుమతి లేనందున కార్యక్రమం నిర్వహించకూడదని చెప్పారు. నిర్వాహకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

మంత్రివర్గంలో సామాజిక న్యాయం ఎక్కడుంది?: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: మంత్రివర్గంలో సామాజిక న్యాయాన్ని నిలబెట్టినట్లు డీఎంకే చెప్పుకోలేదని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ విమర్శించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు మంత్రివర్గాన్ని పునర్‌వ్యవస్థీకరించారని, ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని తెలిపారు. తమిళనాడులో అధికంగా ఉండే వన్నియర్, దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన డీఎంకే ఆ సామాజిక వర్గాలకు అన్యాయం చేస్తోందన్నారు. డీఎంకేలోని ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది వన్నియర్లు ఉన్నారని, ఆ ప్రకారం 34 మంత్రి పదవుల్లో 6 మంత్రి పదవులు వన్నియర్లకు ఇచ్చుండాలన్నారు. అయితే ముగ్గురికి మాత్రమే మంత్రి పదవులు దక్కాయని ధ్వజమెత్తారు. అలాగే దళితులకు కూడా అన్యాయం జరుగుతోందని తెలిపారు. వన్నియర్ల తర్వాత 16 శాతం దళితులు ఉన్నారని, వారికి 5 మంత్రి పదవులు ఇచ్చుండాలని, అయితే వారికి కూడా మూడు పదవులు మాత్రమే దక్కాయన్నారు. సెంథిల్‌బాలాజీని మంత్రివర్గంలో చేర్చుకోవటం ద్వారా సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేదా అని ప్రశ్నించారు. దీన్ని న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థలు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

ఉవ్వెత్తున ఎదిగిన ఉదయనిధి

మూడేళ్లలో ఉప ముఖ్య మంత్రి స్థాయి

2021 శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉదయనిధి స్టాలిన్ మూడేళ్లలో ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆయన వచ్చిన తర్వాతే అన్ని ఎన్నికల్లో డీఎంకే విజయాల పరంపర కొనసాగించిందని, దాని వెనుక ఆయన కృషి కూడా ఎనలేనిదని పార్టీ సీనియర్లు సైతం చెబుతున్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ రాజకీయ ప్రస్థానాన్ని చూస్తే... - న్యూస్‌టుడే, చెన్నై

సినీ రంగం నుంచి..

రాజకీయ, సినీ, సాహిత్య రంగం నేపథ్యమున్న కరుణానిధి కుటుంబానికి చెందిన ఉదయనిధి మొదట సినీ రంగంవైపే మొగ్గు చూపారు. మొదట విజయ్, త్రిష జంటగా నటించి 2008లో విడుదలైన 'కురువి' నిర్మాతగా వ్యవహరించారు. గౌతమ్ మేనన్ దర్శకత్వంలోని 'విణ్ణైతాండి వరువాయా' చిత్రానికి సమర్పకులుగా ఉన్నారు. సినీ రంగంలో నిర్మాతగా కొనసాగిన పలు చిత్రాల్లో హీరోగానూ నటించి మెప్పించారు.

ప్రచారంతోనే ప్రతిభ

సినీ రంగంలో సత్తా చాటుతున్న సమయంలోనే క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నట్లు 2018 మార్చిలో ప్రకటించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలు, 22 శాసనసభ ఉప ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేపట్టారు. ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి భారీ విజయాన్ని దక్కించుకుంది. దానికి ఉదయనిధి ప్రచారం కూడా ఓ కారణమనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదే ఏడాది జులై 7న ఆయనకు పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా కీలక బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. 2021 శాసనసభ ఎన్నికల్లో చేపాక్కం-తిరువల్లికేణి అభ్యర్థిగా పార్టీ టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఆ సమయంలో ఆయనకు మంత్రి పదవి ఖాయమనే వార్తలు జోరుగా వినిపించినా అది జరగలేదు. కుటుంబ రాజకీయాలు వంటి విమర్శలకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించడమే అందుకు కారణం. మరోవైపు ఉదయనిధికి మంత్రి పదవి ఇవ్వాలనే డిమాండ్లను పార్టీ సీనియర్లు బహిరంగంగా వినిపించారు. ఎట్టకేలకు 2022లో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి అయ్యారు.

నెరవేరిన పార్టీ శ్రేణుల కాంక్ష..

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ ఉదయనిధి కీలకపాత్ర పోషించారు. డీఎంకే కూటమి తిరుగులేని విజయం సాధించింది. ఆ తర్వాత నుంచి ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించాలనే డిమాండ్లు పార్టీ శ్రేణులు నుంచి వినిపించాయి. ఉప ముఖ్యమంత్రి పదవి ఖాయమంటూ పలు సందర్భాల్లో జోరుగా ప్రచారం జరిగింది. వాటిని ముఖ్యమంత్రి స్టాలిన్ ఖండించకపోగా సానుకూలంగానే సంకేతాలు ఇచ్చారు. నగరంలో 17న జరిగిన డీఎంకే వజ్రోత్సవాల కార్యక్రమంలో కూడా ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి గురించి కేంద్ర మాజీ మంత్రి ఎస్.ఎస్.పళనిమాణిక్యం వేదికపైనే ప్రస్తావించారు. కొన్ని రోజులుగా ఉప ముఖ్యమంత్రి పదవి వ్యవహారం జోరుగా కొనసాగిన నేపథ్యంలో ఎట్టకేలకు శనివారం రాత్రి గవర్నర్ ఆమోదంతో పార్టీ శ్రేణుల అంచనాలు, ఆకాంక్షలు ఫలించాయి.

తండ్రి బాటలోనే..

ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా రాజకీయంగా ఎదిగిన విధానంలోనే ఆయన తనయుడు ఉదయనిధి కూడా పయనిస్తున్నారు. డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా స్టాలిన్ చాలా ఏళ్లపాటు వ్యవహరిస్తూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో తండ్రి కరుణానిధి నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయన మంత్రివర్గంలో స్టాలిన్‌కు చోటు దక్కింది. తర్వాత ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. నాడు పార్టీలో పలువురు సీనియర్ నేతలు మంత్రివర్గంలో ఉన్నా కరుణానిధి వారిని ఒప్పించి స్టాలిన్‌కు ఉప ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించారు. ఇదే తరహాలో ఉదయనిధి కూడా డీఎంకేలో యువజన విభాగం కార్యదర్శి పదవి వహించిన తర్వాత ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. స్టాలిన్ తర్వాత ముఖ్యమంత్రిగా ఉదయనిధికి మార్గం సుగమం చేస్తున్నట్లు రాజకీయ పక్షాల విమర్శలూ ఉన్నాయి.

పాత నేరస్థుల నివాసాల్లో తనిఖీ

తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ నిషా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో గంజాయి వినియోగం నియంత్రణకు జిల్లా ఎస్పీ ఎన్ఎస్ నిషా మాజీ ఖైదీల నివాస ప్రాంతాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. నీలగిరి జిల్లా తమిళనాడు, కేరళ, కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. దీంతో నీలగిరిలో గంజాయి, పొగాకు ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉంది. నివారణకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. కున్నూర్, గూడలూర్ ప్రాంతాలలో నిఘా కట్టుదిట్టం చేశారు. చెక్‌పోస్టుల్లో అదనపు బలగాలను నియమించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పాత నేరస్థుల నివాసాల్లో పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఎన్ఎస్ నిషా ఆదివారం ఊటీ ప్రాంతంలోని పాత నేరస్థుల నివాసాల్లో తనిఖీలు జరిపారు. వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. వెంట అసిస్టెంట్ డీఎస్పీ యశోధ, ఇన్‌స్పెక్టర్ మురళీధరన్, ఏఎస్సైలు ఉన్నారు.

శ్మశానాన్ని సరిచేయండి సారూ!

వాననీటిలోనే మృతదేహాన్ని ఖననం చేస్తున్న దృశ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: నాగర్‌కోవిల్ నుంచి కన్నియాకుమరికి వెళ్లే మార్గంలో కొట్టారం పట్టణ పంచాయతీ ఉంది. దీని పరిధిలోని ఆరుముగపురం, లక్ష్మీపురం కాలనీల్లో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో ఎక్కువగా ఆదిద్రవిడ సామాజిక వర్గ ప్రజలు ఉన్నారు. వీరు ఎప్పటినుంచో చెరువు పక్కున ఉన్న శ్మశానంలో మృతదేహాలను ఖననం చేస్తున్నారు. శ్మశానం ప్రాంతంలో ప్రస్తుతం ఆక్రమణలు చోటుచేసుకుని పక్కనే ఉన్న స్థలాల ఎత్తు పెంచడంతో చిన్న వాన కురిసినా శ్మశానం చెరువులా తలపిస్తోంది. దీంతో పలుమార్లు సమస్యను ఆప్రాంతవాసులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షానికి శ్మశానంలో నీరు నిలిచింది. ఆ సమయంలో ఓ వ్యక్తి మృతిచెందగా నీటిలోనే గుంత తీసి ఖననం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరుకి వినతిపత్రం అందజేశారు. కలెక్టరు శ్మశానాన్ని బాగుచేయాలని ఆదేశించినా పట్టణ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టలేదు. దీని గురించి అధికారులు మాట్లాడుతూ... శ్మశాన స్థలం ప్రజాపనులశాఖ ఆధీనంలో ఉందని, వారు అనుమతిస్తే వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు.

జానపద కళలను కాపాడుకోవాలి

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు వారి సంస్కృతిని తరతరాలకు తెలియజేసే జానపద కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాదుకు చెందిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా. చిగిచెర్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వేద విజ్ఞాన వేదిక ప్రతీ నెల నిర్వహించే తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం 153వ ప్రసంగం 'జానపద భాషా వైభవం' అంశంపై కార్యక్రమం టీనగర్ ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణాహాలు వేదికగా జరిగింది. డా.చిగిచెర్ల కృష్ణారెడ్డి వక్తగా పాల్గొని ప్రసంగించారు. జానపద కళలు పుట్టినతీరు, వాటి ప్రాశస్త్యం గురించి వివరించారు. వేంకటేశ్వరస్వామిని సుప్రభాతంతో ఎలా నిద్ర లేపుతారో అలాగా పూర్వకాలంలో పల్లెల్లో జానపద కళాకారులు పాటలు పాడుతూ ప్రజలను నిద్ర లేపేవారన్నారు. ముందుగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతం పలుకగా అధ్యక్షుడు జేకే రెడ్డి వక్తను పరిచయం చేశారు. వక్తను సత్కరించడంతో పాటు జ్ఞాపికను అందజేశారు.

చిగిచెర్ల కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కందనూరు మధు, జేకే రెడ్డి ◗ పాల్గొన్న ఆహూతులు

రాష్ట్రంలో ఏ విద్యా విధానం పాటించాలి?

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో ఏ విద్యా విధానాన్ని అనుసరించాలనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ కోరింది. తమిళనాడు నర్సరీ, ప్రైమరీ, మెట్రిక్, హయ్యర్ సెకండరీ, సీబీఎస్ఈ పాఠశాలల ప్రతినిధుల సమావేశం మదురైలో ఆదివారం జరిగింది. సమావేశంలో తమిళనాడు కిండర్‌గార్డెన్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కలల్వారి త్యాగరాజన్, జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, జిల్లా కార్యదర్శి రాజు మొదలైన వారు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కిండర్‌గార్డెన్‌లకు అనుమతి పొందడంలో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. కిండర్‌గార్డెన్‌లకు సులభంగా అనుమతులు ఇవ్వాలని, 10 ఏళ్ల తర్వాత శాశ్వత అనుమతి కల్పించాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో త్రిభాషా విధానాన్ని అనుసరిస్తున్నారని, జాతీయ విద్యా విధానం కూడా త్రిభాషా విధానాన్ని పాటించాలని తెలుపుతోందని చెప్పారు. దీంతో ఏ విద్యా విధానం పాటించాలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా ఆదివారం సాయంత్రానికి క్యూలైన్‌లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. క్యూలైన్‌లోని భక్తులకు తితిదే అధికారులు శ్రీవారి సేవకుల ద్వారా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఆరు కంపార్ట్‌మెంటులో వేచి ఉన్నారు. వీరికి మూడుగంటల్లో దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 71,133 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.28 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.

కాలువల్లో చెత్త వేసినందుకు రూ.2.05 లక్షల జరిమానా

చెన్నై, న్యూస్‌టుడే: కాలువల్లో చెత్త వేసిన ఇళ్లు, దుకాణాలు, వాణిజ్య సంస్థల నుంచి రూ.2.05 లక్షల జరిమానాను చెన్నై మహానగర కార్పొరేషన్ యంత్రాంగం వసూలు చేసింది. ఉత్తర ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు పర్యవేక్షణలోని మానిటరింగ్ కమిటీ ఆదివారం కాలువల వెంబడి ఉన్న ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఈ జరిమానాలు విధించింది. కాలువల్లో చెత్తను వేసి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించేవారిపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు ఇప్పటికే కార్పొరేషన్ యంత్రాంగం హెచ్చరించడం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం



భూపాలన్, అయ్యప్పన్ (పాతచిత్రాలు)

సైదాపేట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... విళుప్పురం జిల్లా దిండివనం సమీప పేరణి ప్రాంతానికి చెందిన అయ్యప్పన్ (32), ఇతని స్నేహితుడు భూపాలన్ (49) తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరిగి శనివారం రైలు ద్వారా దిండివనం చేరుకున్నారు. అక్కడ ఉంచిన వారి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని అర్ధరాత్రి పేరణి గ్రామానికి బయలుదేరారు. చెన్నై- తిరుచ్చి జాతీయ రహదారిపై విశంగంపాడి పెట్రోలు బంకు వద్ద వెళ్తుండగా వేగంగా వచ్చిన ఓ కారు నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొని తర్వాత ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో అయ్యప్పన్, భూపాలన్, నడిచి వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు రోడ్డుపక్కన బోల్తాపడగా కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మహిళా పోలీసు...



అంగయర్‌కన్ని (పాతచిత్రం)

ప్యారిస్: విరుదునగర్ జిల్లా అరుప్పుక్కోట్టైకి చెందిన అంగయర్‌కన్ని (39) అరుప్పుక్కోట్టై ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె ఈనెల 17న తన భర్త మహేశ్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కోవిల్పట్టిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. అరుప్పుక్కోట్టైకి దగ్గరలో వేగంగా వచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ అంగయర్‌కన్ని శనివారం సాయంత్రం మృతిచెందింది. ఆమె అంత్యక్రియలు ఆదివారం ఉదయం అరుప్పుక్కోట్టైలో జరిగాయి. ఎస్సీ కణ్ణన్ మృతదేహానికి నివాళులర్పించారు.

నీటమునిగి బాలిక...

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సమీప కేత్తిఅరక్కాడు ప్రాంతంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన జోసఫ్‌రాయ్, ఆయన భార్య, కుమార్తెలు తన్వి (3), మన్వి (2)తో కలిసి ఏడాదిగా నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తలు అరక్కాడు ప్రాంతంలోని పుట్టగొడుగుల కర్మాగారంలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరూ పనిలో ఉండగా ఇద్దరు కుమార్తెలు కర్మాగారం సమీపంలో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో మన్వి అక్కడు ఉన్న గుంతలో పడింది. తన్వి ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు అక్కడకు వచ్చి చూడగా నీటిలో చిన్నారి తేలుతూ కనిపించింది. వెంటనే బయటకుతీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

టేపు అంటిస్తారు.. నగదు కాజేస్తారు

- ఏటీఎంలలో వినూత్నంగా డబ్బులు కాజేస్తున్న ఇద్దరు యువకులు
- పోలీసుల ముమ్మర గాలింపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్‌లో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాలపై వచ్చి ఏటీఎం కేంద్రాల్లోని యంత్రాలలో నగదు వచ్చే చోట టేపు అంటించి వినూత్నంగా డబ్బులు కాజేస్తున్నారు. కార్డు పెట్టిన వ్యక్తి తనకు ఎంత నగదు కావాలో నొక్కి వేచిచూసేటప్పుడు టేపు వరకు వచ్చిన నోట్లు బయటకు రాలేక ఆగిపోతాయి. దీంతో యంత్రంలో సమస్య ఉండటంతో నగదు రాలేదని నిరాశతో కార్డుదారులు వెళ్లిపోతారు. ఆ తర్వాత బయటే పొంచి ఉన్న కేటుగాళ్లు లోపలికి వెళ్లి అంటించిన టేపుని తీసేసి అక్కడ ఉన్న నగదు తీసుకొని దర్జాగా వెళ్తున్నారు. మొదట రత్నపురి ప్రాంతంలోని ఏటీఎంలో ఈ తరహా చోరీ జరిగింది. తర్వాత ఆ యువకులు ఆవరంపాళ్యం, కరుదంబట్టి, పెత్తనూర్ ప్రాంతాలోని యంత్రాలలో చేతివాటం చూపారు. దీని గురించి ప్రత్యేక బృంద పోలీసులు దర్యాప్తు జరిపారు. నిందితులు వేరే రాష్ట్రానికి చెందినవారిగా గుర్తించారు. ఓ ఏటీఎం కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా వారి కోసం గాలిస్తున్నారు.

యువకుడి దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కుల్ పూచ్చినాయక్కన్‌పట్టికి చెందిన షంషుద్దీన్ కుమారుడు మహ్మద్ ఇర్ఫాన్ (24) శనివారం రాత్రి తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై దిండుక్కుల్ బస్టాండ్ వద్దకు వచ్చి తిరిగి ఒంటరిగా ఇంటికి బయలుదేరాడు. రెండు ద్విచక్రవాహనాలపై అతన్ని వెంబడించిన దుండగులు అడ్డగించి మారణాయుధాలతో దాడిచేసి హతమార్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలప గోదాములో అగ్నిప్రమాదం

తిరునెల్వేలి, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా పేట్టై ప్రాంతానికి చెందిన మొహిద్దీన్ పిళ్లైకి కలప గోదాము ఉంది. ఇందులో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 17 గంటలు శ్రమించి మంటలు అదుపుచేశారు. పోలీసులు కేసునమోదు చేసి ప్రమాద కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

భార్యాభర్తల హత్య కేసులో ఐదుగురి అరెస్టు

డబ్బు కోసం కిడ్నాప్ చేసి హత్య

నిందితులు రాజేష్‌కుమార్, సాయి బాలాజీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: డబ్బు కోసం భార్యాభర్తలను కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేసిన 5 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా తడంగం సమీప వెత్తలక్కారన్ పల్లం గ్రామంలో ఈనెల 24వ తేదీ తేని జిల్లాకు చెందిన మణిగండన్ (55), ఆయన భార్య ప్రేమలత హత్యకు గురయ్యారు. పోలీసుల దర్యాప్తులో.. ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న వీరికి పిల్లలు లేరు. అధికంగా ఆస్తులున్నాయి. కోవై ప్రధాన కార్యాలయంగా ఉన్న ఫైనాన్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన రూ.40 కోట్లు ఇటీవల వచ్చాయి. ఈ క్రమంలో కొడైక్కానల్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న తేని రాశింగపురానికి చెందిన దేవరాజ్ (31) అనే వ్యక్తితో మణిగండన్‌కు పరిచయమేర్పడింది. ఆయనతో మణిగండన్ తనవద్ద ఉన్న డబ్బుతో ఏదైనా వ్యాపారం చే